**విలేకరులు కావలెను**

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రిక.

సంప్రదించాల్సిన చిరునామా..

నిజామాబాద్ సెల్ : 9440731515



epaper.prajashankaravam.com

తెలుగు డైలీ ఈ-పేపర్

RNI NO: TELTEL/2022/85170

# ప్రజా శంఖారావం

తెలుగు దిన పత్రిక

ప్రతి అక్షరం.. ప్రజా స్వరం..

PRAJA SHANKARAVAM TELUGU DAILY

పేజీలు 8

మంగళవారం 27-10-2026 | సంపుటి: 04 | సంచిక: 150 | వెల: రూ. 3/- | ఎడిటర్: పుట్టి మురళి

హైదరాబాద్ | ఆదిలాబాద్ | నిర్మల్ | నిజామాబాద్ | కామారెడ్డి | జగిత్యాల | మంచిర్యాల | సిద్దిపేట్ | రాజన్న సిరిసిల్ల | సంగారెడ్డి | మెదక్


## సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ విఫలం: హరీశ్‌రావు



- దేవాదుల నుంచి నీళ్లెందుకు ఎత్తలేదు?
- కేసీఆర్‌కు పేరు వస్తుందనే మోటార్లు ఆపారు
- తుమ్మిడిహెట్టిపై రూ.25 వేల కోట్ల ఖర్చు ఎందుకు?
- మంత్రి ఉత్తమ్‌కు రాజీనామా సవాల్

**హైదరాబాద్, అక్టోబరు 26:** తెలంగాణలో సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నా, తాగు, సాగునీటి అవసరాలపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా నీటిని సమర్థంగా తరలిస్తుంటే, తెలంగాణలో

మిగతా 2వ పేజీలో..

## హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 కు కేంద్రం ఆమోదం



- రూ.24,269 కోట్లతో విస్తరణకు ప్రతిపాదన
- 76.4 కి.మీ. మేర ఐదు కొత్త కారిడార్లు
- నాగోల్–విమానాశ్రయ మార్గం కీలకం
- 2029 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యం

3



# తుమ్మిడిహెట్టి బ్యారేజీపై ముందడుగు

- ముంబైలో ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ బృందం భేటీ
- బ్యారేజ్ ఎత్తు 152 మీటర్లకు పెంచాలన్న ప్రతిపాదనపై చర్చలు
- మాకు ప్రతికూల ప్రభావం లేకపోతే గత ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు సిద్ధం: ఫడ్నవీస్
- ఆదిలాబాద్ గిరిజనుల, ఆదివాసీల చిరకాల ఆకాంక్షలను వివరించిన సీఎం రేవంత్
- 152 మీటర్ల ఎత్తు ఎందుకు అవసరమో వివరించిన మంత్రి ఉత్తమ్
- రెండు రాష్ట్రాల అధికారుల కమిటీ ఏర్పాటుకు మహారాష్ట్ర సీఎం ప్రతిపాదన

**ముంబై, అక్టోబర్ 26 :** ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. తెలంగాణమహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు. ఈ భేటీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,మ రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ తుమ్మిడిహెట్టి ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్

మిగతా 2వ పేజీలో..



## నేను చస్తేనే బిల్లులు చెల్లిస్తారా?

- పెండింగ్ బిల్లులపై సొంత ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- 30 వేల మందితో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరిక
- మంత్రుల నియోజకవర్గాలకే నిధులు విడుదల చేస్తారా అంటూ ప్రశ్న
- జడ్చర్లలో పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్
- సాగునీటి కోసం పార్టీలకు అతీతంగా పోరాడతానని స్పష్టం

2

## నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

- 10రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లుల చెల్లింపు
- పాలేరు నియోజవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి వెల్లడి



**ఖమ్మం/నేలకొండపల్లి, అక్టోబర్ 26 :** పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని, పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల కల్పన, బౌద్ధ స్థల సంరక్షణ/పునరుద్ధరణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన వేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ 3వ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్తూపాన్ని సుమారు 5055 సంవత్సరాల క్రితం నేలకొండపల్లి గ్రామంలో

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణ గొంతును వినిపిస్తాం

- బ్రిక్స్ సమావేశాల్లో శాసనసభాపతి ప్రసాద్ కుమార్

2



## వడ్ల ధరకు రికార్డు.. క్వింటాలు రూ.5,016

- కేసముద్రం మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకానికి ఆల్‌టైమ్ గరిష్ఠ ధర
- సన్న ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో రూ.3,000–3,500
- ఇతర రాష్ట్రాల నుంచి పెరిగిన వ్యాపారుల కొనుగోళ్లు
- మద్దతు ధరను మించిన మార్కెట్ ధరతో ప్రభుత్వానికి సవాలు
- రిటైల్ మార్కెట్‌లో కిలో సన్న బియ్యం రూ.90–100

2

## మహాలక్ష్మితో మహిళలకు రూ.10 వేల కోట్ల ఆదా

- 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు
- రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలకు ప్రయాణ సౌకర్యం
- ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల వాటా 67 శాతానికి పెరుగుదల
- 98 శాతానికి చేరిన బస్సుల ఆక్యుపెన్సీ రేటు

3





## ఏఈఈ అభ్యర్థులకు టీజీపీఎస్సీ వెసులుబాటు

- నవంబర్ 7న పరీక్షకు అవకాశం
- అక్టోబర్ 30లోపు పత్రాల సమర్పణ
- ఎస్ఎస్‌సీ జేఈ, ఏఈఈ పరీక్షల తేదీలతో ఇబ్బందులు
- అర్హులైన అభ్యర్థులకే అవకాశం

2

## అమిత్ షా పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట



- ఆరేళ్ల నాటి కేసులో నిర్దోషిగా ప్రకటించిన సుల్తాన్‌పూర్ కోర్టు
- 2018 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలతో వివాదం
- బీజేపీ నేత విజయ్ మిశ్రా దాఖలు చేసిన ఫిర్యాదుతో విచారణ
- తీర్పు సమయంలో కోర్టుకు హాజరైన లోక్‌సభ ప్రతిపక్ష నేత

4

## ధనుష్ రాజకీయ ప్రవేశంపై మళ్లీ చర్చ

- మహిళా అభిమానులకు దీపావళి కానుకగా వెండి దీపాల పంపిణీ
- దీపాలపై కమలం ముద్రతో రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు
- గుర్తు తయారీదారుదేనని స్పష్టం చేసిన అభిమాన సంఘం
- 'ఆపరేషన్ డి' పేరుతో బీజేపీపై కాంగ్రెస్ నేత ఆరోపణలు
- ధనుష్‌ను పార్టీలోకి ఆహ్వానించిన అన్నాడీఎంకే

4



## ఢిల్లీలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

- రాష్ట్రపతి భవన్ సమీపంలో చెలరేగిన మంటలు
- దట్టమైన పొగలు వ్యాపించడంతో అప్రమత్తమైన అధికారులు
- ఘటనా స్థలానికి ఆరు అగ్నిమాపక వాహనాలు

4



# నేను చస్తేనే బిల్లులు చెల్లిస్తారా?

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 26:**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తయినా బిల్లులు విడుదల చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు రావాల్సిన బిల్లుల కోసం తాను చనిపోవాల్సిందేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

అనిరుధ్‌రెడ్డి సోమవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, గుండ్లపొట్లపల్లి సహా పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**మంత్రుల నియోజకవర్గాలకే ప్రాధాన్యమా?**

మంత్రుల నియోజకవర్గాల్లోనే బిల్లులు చెల్లిస్తారా? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటని అనిరుధ్‌రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ మరణించిన తర్వాత ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. తన నియోజకవర్గంలో పనులు చేసిన వారికి బిల్లులు రావాలంటే తాను ప్రాణాలు కోల్పోవాల్సిందేనా అంటూ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

**అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి చేసినప్పుడే ప్రభుత్వం నిలదొక్కుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గానికి సాగునీరు అందించే విషయంలో పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంత దూరమైనా వెళతానని చెప్పారు. పెండింగ్ బిల్లులు, నియోజకవర్గానికి రావాల్సిన నిధుల విడుదలపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ విఫలం: హరీశ్‌రావు

**మొదటిపేజీ తరువాయి**



దేవాదుల నుంచి నీటిని ఎందుకు ఎత్తలేకపోయారని ప్రశ్నించారు.

దేవాదుల ప్రాజెక్టును సక్రమంగా నిర్వహించి ఉంటే వరంగల్, కరీంనగర్ జిల్లాల రైతులకు ఇబ్బందులు ఎదురయ్యేవి కావని హరీశ్‌రావు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా నీటిని వినియోగించడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే కన్నెపల్లి మోటార్లను ఆన్ చేయలేదని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారని మండిపడ్డారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే దెబ్బతీసిందని వ్యాఖ్యానించారు.

అధికారంలోకి వచ్చిన 1,054 రోజుల తర్వాత మహారాష్ట్రతో చర్చలకు వెళ్లడంపై హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద తెలంగాణ వినియోగానికి తగిన నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) స్పష్టం చేసిందని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, అయితే ఆయకట్టు లేని ప్రాజెక్టు కోసం రూ.25 వేల కోట్లు ఖర్చు చేయడం ఎందుకని ప్రశ్నించారు.

తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యం కాదని హరీశ్‌రావు సవాల్ విసిరారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురాగలిగితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురాగలమని నిరూపించాలని డిమాండ్ చేశారు. అలా చేయలేకపోతే ఉత్తమ్ తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు.



# ఏఈఈ అభ్యర్థులకు టీజీపీఎస్సీ వెసులుబాటు

**హైదరాబాద్, అక్టోబరు 26:**

తెలంగాణలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఊరటనిచ్చింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) జూనియర్ ఇంజనీర్ (జేఈ) పరీక్ష, ఏఈఈ పరీక్ష ఒకే రోజు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభ్యర్థులకు ప్రత్యామ్నాయ తేదీని కల్పించింది. నవంబర్ 6, 2026న ఎస్ఎస్‌సీ జేఈ పరీక్షకు హాజరు కావాల్సి ఉండి, ఏఈఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అర్హులు నవంబర్ 7న పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించింది.

ఈ వెసులుబాటు పొందాలనుకునే అభ్యర్థులు అక్టోబర్ 30, 2026 సాయంత్రం 5 గంటల్లోగా అవసరమైన పత్రాలను సమర్పించాలి. నవంబర్ 6 తేదీతో ఉన్న ఎస్ఎస్‌సీ జేఈ హాల్‌టికెట్ కాపీ, ఏఈఈ దరఖాస్తు పత్రం, టీజీపీఎస్సీ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) ఐడీ వివరాలను అందించాలి. ఈ పత్రాలను కమిషన్ కార్యాలయ హెల్ప్‌డెస్క్‌లో నేరుగా ఇవ్వవచ్చు. లేదంటే helpdesk@tgpsc.gov.in ఈమెయిల్ చిరునామాకు పంపించాలి.

అభ్యర్థులు సమర్పించిన పత్రాలను పరిశీలించిన తర్వాత అర్హులైన వారికే నవంబర్ 7న ఏఈఈ పరీక్ష రాసేందుకు అనుమతి లభిస్తుంది. నవంబర్ 6న ఎస్ఎస్‌సీ జేఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండి, ఏఈఈ పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్నవారికే ఈ అవకాశం వర్తిస్తుంది.

ఎస్ఎస్‌సీ జేఈ (సివిల్) పరీక్షలు నవంబర్ 2 నుంచి 6 వరకు, టీజీపీఎస్సీ ఏఈఈ (సివిల్) పరీక్షలు నవంబర్ 6, 7 తేదీల్లో జరగనున్నాయి. రెండు పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తేదీల పరంగా ఎదురైన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని టీజీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకుంది. అర్హులైన అభ్యర్థులు గడువులోగా పత్రాలు సమర్పించాలని సూచించింది.

# తుమ్మిడిహెట్టి బ్యారేజీపై ముందడుగు

**మొదటిపేజీ తరువాయి**



జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తు చేశారు. అయినా ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు. బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ 2016లో ఒప్పందం కుదిరిందని గుర్తు చేస్తూ ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమంటూ గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ పరిస్థితుల్లో బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాలపరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రజెంటేషన్‌లో వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

**రెండు రాష్ట్రాల మధ్య చారిత్రక అనుబంధం : సీఎం రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రెండు రాష్ట్రాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తు చేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమంటూ అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫడ్నవీస్ దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తు చేశారు. నాటినుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నా దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని వివరించారు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు.

**సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం**

దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.

**ఫడ్నవీస్ సానుకూల స్పందన**

తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి విషయంలో కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

**ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఫడ్నవీస్‌కు తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

# వడ్ల ధరకు రికార్డు.. క్వింటాలు రూ.5,016

- **కేసముద్రం మార్కెట్‌లో ‘జై శ్రీరామ్’ రకానికి ఆల్‌టైమ్ గరిష్ఠ ధర**
- **సన్న ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో రూ.3,000–3,500**
- **ఇతర రాష్ట్రాల నుంచి పెరిగిన వ్యాపారుల కొనుగోళ్లు**
- **మద్దతు ధరను మించిన మార్కెట్ ధరతో ప్రభుత్వానికి సవాలు**
- **రిటైల్ మార్కెట్‌లో కిలో సన్న బియ్యం రూ.90–100**



**హైదరాబాద్, అక్టోబర్ 26:**

తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ‘జై శ్రీరామ్’ రకం ధాన్యం క్వింటాలుకు రూ.5,016 పలికి రికార్డు సృష్టించింది. నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోనూ సన్న రకం ధాన్యానికి రూ.3,000 నుంచి రూ.3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ధర పెరుగుదలకు కారణాలివే**

ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గినట్లు అంచనాలున్నాయి. ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలు కూడా దిగుబడుల అంచనాలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి ప్రైవేటు వ్యాపారులు, రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు వ్యాపారులు రైతులకు ముందుగానే నగదు చెల్లించి పంటను కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్‌లో పోటీ పెరిగి ధరలు ఎగబాకుతున్నాయి. ‘జై శ్రీరామ్’తో పాటు ఆర్ఎన్ఆర్ వంటి సన్న రకాలకూ క్వింటాలుకు రూ.4,300 వరకు ధర లభిస్తోంది.

**ప్రభుత్వ కొనుగోళ్లకు ఇబ్బందులు**

ప్రభుత్వం ఏగ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461 మద్దతు ధర ప్రకటించింది. ఎంపిక చేసిన ఏడు సన్న రకాలపై రూ.500 బోనస్ కలిపితే రైతుకు గరిష్ఠంగా రూ.2,961 అందుతుంది. అయితే బహిరంగ మార్కెట్‌లో ధర రూ.3,500 వరకు పలుకుతుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరమైన సన్న బియ్యాన్ని సేకరించడం ప్రభుత్వానికి సవాలుగా మారుతోంది.

**వినియోగదారులపై ధరల భారం**

ధాన్యం ధరలు పెరగడం రైతులకు లాభదాయకంగా ఉన్నప్పటికీ, బియ్యం కొనుగోలు చేసే వినియోగదారులపై భారం పెరుగుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న బియ్యం ధర కిలోకు రూ.90 నుంచి రూ.100 వరకు చేరింది. మరోవైపు, సన్న రకం ధాన్యం ధరల పెరుగుదలకు ఎల్‌నినో ప్రభావం కారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో సన్న వడ్ల సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు ఎదురైనా, ప్రస్తుతం రైతులకు దాని ప్రయోజనం అందుతోందని వ్యాఖ్యానించారు.

నవంబర్, డిసెంబర్ నెలల్లో కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత మార్కెట్‌లో ధాన్యం సరఫరా పెరిగే అవకాశం ఉంది. ఆ సమయంలో ధరలు ఏ విధంగా మారతాయన్నది రైతులు, వ్యాపారుల్లో ఆసక్తి రేపుతోంది.

# తెలంగాణ గొంతును వినిపిస్తాం

**న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 26 :**

బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను ఈ సమావేశాల్లో వివరిస్తామని తెలిపారు. ఢిల్లీలోని సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం)లో ఈ రోజు, రేపు (26, 27 తేదీల్లో) జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కూడా పాల్గొన్నారు. కాగా, బ్రిక్స్ సమావేశాలకు హాజరయ్యేందుకు ప్రసాద్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డిలు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈ ఉదయం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టులో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాగా, స్పీకర్ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

**మొదటిపేజీ తరువాయి**

గుర్తించారని, దేశంలోనే అత్యంత పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రారంభించినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోయాయన్నారు. స్తూపం చుట్టూ ఉన్న ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో పురావస్తు శాఖ అధికారులు గతంలో జరిపిన తవ్వకాల్లో ఎన్నో పురాతన వస్తువులు లభ్యమయ్యాయని, వాటిని భద్రపరిచేందుకు స్థానికంగా వసతులు లేక హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన బౌద్ధ మతస్తులు, స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రాబోయే రోజుల్లో బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న ప్రముఖ నిపుణులను, అధికారులను ఇక్కడికి ఆహ్వానించి విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు.

**పది రోజుల్లో ఫైనల్ బిల్లుల చెల్లింపు**

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లులన్నింటినీ రాబోయే పది రోజుల్లోగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి ప్రకటించారు. నేలకొండపల్లి రైతు వేదికలో నేలకొండపల్లి మండల లబ్దిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటి విడత మంజూరైన 648 ఇళ్లలో సుమారు 620 ఇళ్లు పూర్తయ్యాయని, వివిధ కారణాల వల్ల ఆగిన మిగిలిన ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, కరెంటు, నీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో రైతన్నలు నష్టపోకూడదనే ఉద్దేశంతో రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి అన్నారు. అంతకుముందు మంత్రి మండలంలోని అనాసాగరం నుండి పమ్మి వరకు 2.5 కి.మీ మేర రూ.2.80 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై అన్ని ఇంజనీరింగ్ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. కూసుమంచి మండలం గోరిల్లపాడు తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర టీఎస్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల ఎంపీడీవో ఎర్రయ్య, తహసీల్దార్ రాంప్రసాద్, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధజక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. తన పర్యటనలో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట జంక్షన్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ఖమ్మంవరంగల్‌నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి మంత్రి హాజరయ్యారు.

# మహాలక్ష్మితో మహిళలకు రూ.10 వేల కోట్ల ఆదా

**హైదరాబాద్, అక్టోబర్ 26:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూర్చింది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు రూ.10 వేల కోట్లకు పైగా ఆదా చేసుకున్నట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదైనట్లు తెలిపింది.

రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా గతంలో ఉన్న 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సుల ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరింది.

**మహిళల స్వావలంబనకు తోడ్పాటు**

అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించినట్లు ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి రోజువారీ రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గాయని పేర్కొంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ, మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణానికి మాత్రమే పరిమితం కాదని, మహిళల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వావలంబనకు ప్రతీక అని అన్నారు. విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం





మహిళలు ఆర్థిక భారం లేకుండా ప్రయాణించేందుకు ఈ పథకం ఉపయోగపడుతోందని తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు చేపడుతోందని వెల్లడించారు.

# గిరిజనులకు మౌలిక వసతులు కల్పించాలి

- **గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్**

**హైదరాబాద్, అక్టోబర్ 26 :**

కుమ్రం భీమ్ వర్ధంతి(మంగళవారం)ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని నెహ్రూ శత జయంతి గిరిజన మ్యూజియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, సంచాలకుడు సంతోష్ బి.ఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కుమ్రం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుమ్రం భీమ్ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్‌పై గిరిజనుల హక్కుల కోసం కుమ్రం భీమ్ పోరాడారని, ఆయన పోరాట స్ఫూర్తితోనే నేటి ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తున్నాయని చెప్పారు. అదే స్ఫూర్తితో మరింత బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన బాలబాలికలందరికీ నాణ్యమైన విద్య అందించడం, గిరిజన ప్రజలందరికీ వైద్య సదుపాయాలు, కనీస మౌలిక వసతులు కల్పించడం ద్వారా కుమ్రం భీమ్ ఆశయాలను నెరవేర్చగలమని పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు వి.సర్వేశ్వర రెడ్డి, ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వి.సముజ్వల, గిరిజన మ్యూజియంల సంరక్షకుడు





డాక్టర్ సత్యనారాయణ ద్యావనపల్లి, గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్ బాలు, ఎస్సీ హేమలత, సహ సంచాలకురాలు విజయలక్ష్మి తదితర ఉన్నతాధికారులు, శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. వారంతా కుమ్రం భీమ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

- **డీజీపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు**

**హైదరాబాద్, అక్టోబరు 26 :**

డీజీపీ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, భారతీయ సాహిత్యానికి, ఆధ్యాత్మికతకు విశేష సేవలందించిన మహనీయుడని పలువురు కొనియాడారు. చెడు నుంచి సన్మార్గం వైపు పయనించి సమాజానికి మానవతా విలువలను చాటిచెప్పిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డీజీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, ఏఐజీ(అడ్మిన్) జె. అన్యోన్య, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వర రావు, పేషీ డీఎస్పీ భాస్కర్‌తోపాటు సీఏవోలు, ఏఓలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఇన్‌స్టాలో అమ్మాయి పేరుతో నకిలీ ప్రొఫైల్

- **దేశవిదేశాల్లో యువకులకు వల**
- **బీటెక్ విద్యార్థిపై లైంగిక దాడి**
- **ప్రైవేట్ వీడియోలతో బ్లాక్‌మెయిల్**
- **వైద్యులు, పోలీసులూ బాధితులే**
- **విదేశాలకూ విస్తరించిన హనీట్రాప్**

**హైదరాబాద్, అక్టోబరు 26:**

సైదాబాద్ పరిధిలో వెలుగుచూసిన హనీట్రాప్ కేసులో నిందితుడు పవన్ కుమార్ వ్యవహారాలు పోలీసుల కస్టడీ విచారణలో బయటపడుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో 'Moon baby 5973' పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి అమ్మాయిగా నటిస్తూ పలువురితో పరిచయాలు పెంచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో మల్లారెడ్డి కాలేజీలో బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థితో సన్నిహితంగా మెలిగి, అతడిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. తన మాట వినకపోతే ఆత్మహత్య చేసుకుని ఆ నేరాన్ని బాధితుడిపై నెడతానని బెదిరించినట్లు విచారణలో వెల్లడైంది.

నిందితుడి ఫోన్, సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించగా ఈ వ్యవహారం పలు రాష్ట్రాలు, దేశాలకు విస్తరించినట్లు తేలింది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడులకు చెందినవారిని లక్ష్యంగా చేసుకున్నట్లు గుర్తించారు. పాకిస్థాన్, టర్కీ, కెనడా వంటి దేశాల్లోని వ్యక్తులూ బాధితుల జాబితాలో ఉన్నట్లు సమాచారం. వైద్యులు, పోలీసు సిబ్బంది, వ్యాపారవేత్తలు, లెక్చరర్లు, డెలివరీ ఉద్యోగులు సైతం అతడి వలలో చిక్కినట్లు పోలీసులు గుర్తించారు. పరిచయాలను ఆసరాగా చేసుకుని వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించి, వాటిని బయటపెడతానంటూ బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. కొన్ని వీడియోలను ఇతర ప్రైవేట్ ఖాతాల్లో అప్‌లోడ్ చేసినట్లు ఆధారాలు లభించాయి. గతంలో కపిల్ చిట్ ఫండ్స్‌లో పనిచేసిన సమయంలోనూ రుణాల పేరుతో సహోద్యోగిని మోసం చేసినట్లు నిందితుడిపై ఆరోపణలున్నాయి. ఈ కేసులో మరికొందరు బాధితులు ఉన్నారా అనే కోణంలో సైదాబాద్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.






# దృఢ సంకల్పంతో మహర్షులుగా ఎదగవచ్చు

- **వాల్మీకి జయంతి కార్యక్రమంలో రామచందర్‌రావు**

**హైదరాబాద్, అక్టోబర్ 26 :**



పరివర్తనతో ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చనడానికి మహర్షి వాల్మీకి జీవితమే నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలినాళ్ల జీవితంలో దోపిడీదారుడిగా ముద్రపడిన వ్యక్తి అంతర్మథనంతో గొప్ప పరివర్తన చెంది పవిత్ర రామాయణ మహా కావ్యాన్ని రచించి లవకుశులకు గురువై ఆది కవిగా చిరస్మరణీయుడయ్యారని గుర్తు చేశారు. సమాజంలో ఏ స్థాయిలో ఉన్నా దృఢ సంకల్పం, మార్పు, కఠోర కృషితో అట్టడుగువర్గాల వారు సైతం మహర్షులుగా ఎదగవచ్చనే స్ఫూర్తిని వాల్మీకి జీవన చరిత్ర చాటి చెబుతోందన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జయంతి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన రచించిన రామాయణం నేడు ప్రతి ఇంటిలో భాగమై జాతి గుండెల్లో నిలిచిందన్నారు. శ్రీరాముడు దేశమంతటికీ ఆరాధ్యుడని, కేవలం ఉత్తర భారతానికే పరిమితమని, దక్షిణ భారతంలో లేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం ఆయన అవివేకానికి నిదర్శనమని అన్నారు. వాల్మీకి సేవలను స్మరిస్తూ అయోధ్యలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆయన పేరే పెట్టారని గుర్తు చేశారు. కేంద్రం సూచించిన విధంగా దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతికిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు రాబోయే వారం రోజులపాటు ప్రతి ఎస్సీ బస్తీలోనూ వాల్మీకి జయంతి వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వాల్మీకి మహర్షి బోధనలు, హైందవ సంస్కృతి విశిష్టత, ఆదర్శ పురుషుడైన శ్రీరామచంద్రుని సద్గుణాలను సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, కొప్పు బాషా, వాల్మీకి సమాజం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ సింగ్, ఇతర ముఖ్య నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు కేంద్రం ఆమోదం

**హైదరాబాద్, అక్టోబరు 26:**

హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు విస్తరణపై మరోసారి చర్చ మొదలైంది. రెండో దశలో భాగంగా 76.4 కిలోమీటర్ల మేర ఐదు కొత్త కారిడార్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.24,269 కోట్లు. అయితే, ఈ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఇంకా తుది ఆమోదం తెలిపినట్లు అధికారిక సమాచారం లేదు. మెట్రో రెండో దశలో నాగోల్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 36.8 కిలోమీటర్ల మార్గాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. రాయదుర్గం నుంచి కోకాపేట వరకు 11.6 కిలోమీటర్లు, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లు, మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్లు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల మేర ఇతర కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు.

ఈ మార్గాలు అందుబాటులోకి వస్తే నగరంలోని ఐటీ ప్రాంతాలు, పాతబస్తీ, శివారు ప్రాంతాలకు ప్రజా రవాణా సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది. ముఖ్యంగా విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ కల్పించడం ద్వారా ప్రయాణికులకు సౌకర్యం పెరగనుంది. పలు ప్రాంతాల్లో రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. మెట్రో ఫేజ్ 2 ప్రతిపాదనలను కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తెలంగాణ ప్రభుత్వం సమర్పించింది. ప్రాజెక్టుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు, ఆర్థిక వనరులు, సాంకేతిక అంశాలపై పరిశీలన అనంతరమే కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది. ప్రాజెక్టు ఆమోదం, నిర్మాణ పనుల ప్రారంభం, పూర్తి గడువుపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.



## ఖర్గే వ్యాఖ్యలు విచారకరం: రాంచందర్‌రావు

- **ప్రధాని మోదీపై వ్యాఖ్యలను ఖండించిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు**
- **అధికారానికి దూరంగా ఉండటంతోనే కాంగ్రెస్‌లో అసహనం**
- **పాట్నా సభలో ఖర్గే వ్యాఖ్యలతో రాజకీయ దుమారం**
- **బీజేపీ నేతల ఫిర్యాదుతో మరింత ముదిరిన వివాదం**
- **తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**హైదరాబాద్, అక్టోబర్ 26:**

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత నుంచి ఇలాంటి భాష రావడం విచారకరమని అన్నారు. కాంగ్రెస్ నేతలు అధికారానికి దూరంగా ఉండటంతో అసహనానికి గురవుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్‌రావు.. గత పన్నెండున్నరేళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో నిరాశ పెరిగిందని ఆరోపించారు. ఆ అసంతృప్తితోనే మోదీ కుటుంబాన్ని ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే ప్రసంగించిన సభలో వేదికపై ఉన్న నేతల సంఖ్యతో పోలిస్తే ప్రేక్షకులు తక్కువగా ఉన్నారని ఎద్దేవా చేశారు.

**పాట్నా సభలో వివాదాస్పద వ్యాఖ్యలు**

బిహార్ రాజధాని పాట్నాలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఖర్గే ప్రసంగిస్తుండగా, మోదీ ఓడిపోరంటూ ఓ వ్యక్తి నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా వివాదానికి దారితీశాయి.

**బీజేపీ నేతల ఖండన**

ఖర్గే వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఈ అంశంపై రాజకీయ విమర్శలు మరింత తీవ్రతరమయ్యాయి.



## ఆర్‌అండ్‌బీ ఏఈఈ పరీక్షను వాయిదా వేయాలి

- **అదే రోజున ఎస్సెస్సీ జేఈ పరీక్ష**

**హైదరాబాద్, అక్టోబర్ 26 :**

టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ ఏఈఈ పరీక్ష, కేంద్ర ప్రభుత్వ ఎస్సెస్సీ జేఈ పరీక్ష నవంబర్ 6వ తేదీనే నిర్వహించనున్నారు. దీంతో 50 వేల మందికి పైగా రాష్ట్రానికి చెందిన సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎస్సెస్సీ పరీక్ష తేదీని వెబ్‌సైట్‌లో ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. ఈ రెండు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏది రాయాలో, ఏది వదులుకోవాలో తేల్చుకోలేక తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నారని బీఆర్ఎస్ ఎల్పీ ఉప నాయకుడు టి.హరీష్‌రావు తెలిపారు. ఇప్పటికే విద్యార్థులు పలుమార్లు మంత్రులకు, అధికారులకు మొరపెట్టుకున్నా, ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసుకున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదన్నారు. ప్రభుత్వ భేషజాల వల్ల విద్యార్థులు విలువైన అవకాశాన్ని కోల్పోయి వారి భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి ఆర్ అండ్ బీ ఏఈఈ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులందరూ రెండు పరీక్షలు రాసేలా వెసులుబాటు కల్పించి వారి భవిష్యత్తును కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



# ఢిల్లీలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

- రాష్ట్రపతి భవన్ సమీపంలో చెలరేగిన మంటలు
- దట్టమైన పొగలు వ్యాపించడంతో అప్రమత్తమైన అధికారులు
- ఘటనా స్థలానికి ఆరు అగ్నిమాపక వాహనాలు
- ఎక్స్‌లో ఘటనను వెల్లడించిన రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవరా
- ప్రమాదానికి కారణాలు, నష్టం వివరాలు వెల్లడి కావాల్సి ఉంది

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:**

దేశ రాజధానిలోని అత్యంత కీలకమైన ప్రభుత్వ భవనాల్లో ఒకటైన నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాష్ట్రపతి భవన్‌కు సమీపంలో మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ ఆరు వాహనాలను ఘటనా స్థలానికి పంపించింది.

పార్లమెంట్‌కు వెళ్తున్న సమయంలో నార్త్ బ్లాక్ వెనుక వైపు నుంచి దట్టమైన పొగలు వెలువడటాన్ని గమనించినట్లు రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవరా తెలిపారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడిస్తూ, అక్కడ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. అందరూ క్షేమంగా ఉండాలని, అత్యవసర సేవలు వేగంగా స్పందించాలని ఆకాంక్షించారు. పొగలు కనిపిస్తున్న ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు.

ప్రమాద తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. మంటలు చెలరేగడానికి గల కారణాలు, అవి అదుపులోకి వచ్చాయా లేదా అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా, భవనానికి ఎంత మేర నష్టం వాటిల్లిందనే అంశాలపై కూడా అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. అగ్నిమాపక సిబ్బంది పరిశీలన అనంతరం మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

# ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకులు వద్దు

- రూ.120 కోట్ల పనులకు సీతక్క శంకుస్థాపన
- అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి
- అటవీ అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం
- తాగునీరు, రహదారులకు అడ్డంకులొద్దు

**ఆసిఫాబాద్, అక్టోబరు 26:**

ఆదివాసీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రూ.120 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించినప్పుడే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.



ఆదివాసీల సంక్షేమం కోసం నిష్పాక్షికంగా పనిచేసే అధికారులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని సీతక్క అన్నారు. రాష్ట్రంలో పేదలకు గూడు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన పేదలకు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అటవీ నిబంధనల పేరుతో కొందరు అధికారులు అడ్డంకులు సృష్టించడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. తాగునీటి బోర్లు వేయడాన్ని కూడా అడ్డుకోవడమేంటని ప్రశ్నించారు. చెట్లు లేని ప్రాంతాల్లోనూ అటవీ భూముల పేరుతో రహదారుల నిర్మాణాలను నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల అభివృద్ధికి ఆటంకాలు కల్పించే అధికారుల తీరును ప్రజలు తప్పుబడతారని వ్యాఖ్యానించారు. చట్టాలు, నిబంధనలను అమలు చేసే క్రమంలో మానవతా దృక్పథాన్ని విస్మరించకూడదని సీతక్క హితవు పలికారు. మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజల అవసరాలను గుర్తించి, తాగునీరు, రహదారుల వంటి కనీస సదుపాయాల కల్పనకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని కోరారు.

# ధనుష్ రాజకీయ ప్రవేశంపై మళ్లీ చర్చ

- మహిళా అభిమానులకు దీపావళి కానుకగా వెండి దీపాల పంపిణీ
- దీపాలపై కమలం ముద్రతో రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు
- గుర్తు తయారీదారుదేనని స్పష్టం చేసిన అభిమాన సంఘం
- 'ఆపరేషన్ డి' పేరుతో బీజేపీపై కాంగ్రెస్ నేత ఆరోపణలు
- ధనుష్‌ను పార్టీలోకి ఆహ్వానించిన అన్నాడీఎంకే

**చెన్నై, అక్టోబర్ 26:**

తమిళ సినీ నటుడు ధనుష్ రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం మరోసారి తెరపైకి వచ్చింది. తన మహిళా అభిమానులకు దీపావళి కానుకగా పంపిణీ చేసిన వెండి దీపాలపై కమలం ముద్ర ఉండటం ఈ చర్చకు కారణమైంది. అయితే ఆ గుర్తుకు రాజకీయాలతో సంబంధం లేదని ధనుష్ అభిమాన సంఘం స్పష్టం చేసింది.



చెన్నైలోని తోరైపాక్కం సమీపంలో ఓ ప్రైవేట్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ధనుష్ తన అభిమాన సంఘం మహిళా విభాగం సభ్యులను కలిశారు. సుమారు మూడు వేల మంది హాజరైన ఈ కార్యక్రమంలో వారితో ఫొటోలు దిగారు. అనంతరం దీపావళి కానుకగా వెండి దీపాలను అందజేశారు. వాటిపై బీజేపీ ఎన్నికల గుర్తు కమలం ముద్ర కనిపించడంతో రాజకీయంగా చర్చ మొదలైంది. అయితే అది దీపాల తయారీదారుకు సంబంధించిన ముద్ర మాత్రమేనని, రాజకీయ ఉద్దేశం లేదని అభిమాన సంఘం ప్రతినిధి వెల్లడించారు.

**'ఆపరేషన్ డి' అంటూ కాంగ్రెస్ ఆరోపణలు**

ధనుష్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాల నేపథ్యంలో వివిధ పార్టీల నేతలు స్పందిస్తున్నారు. తమిళనాడులో కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్న సినీ ప్రముఖుల వెనుక ఢిల్లీ పెద్దల హస్తం ఉందని అధికార టీవీకే ఆరోపించింది. విజయ్‌కు ధనుష్ ప్రత్యామ్నాయం కాలేరని వ్యాఖ్యానించింది. క్షేత్రస్థాయి పోరాటం ద్వారా విజయ్ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొంది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మాణికం ఠాగూర్ ఈ పరిణామాల వెనుక బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహం ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయ కల్లోలం సృష్టించేందుకు మరో సినీ నటుడిని ముందుకు తెస్తున్నాయని విమర్శించారు. దీనిని 'ఆపరేషన్ డి' లేదా 'ప్లాన్ సి'గా అభివర్ణించారు. గతంలో రజనీకాంత్ ద్వారా తమిళనాడులో పట్టు సాధించేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, ఇప్పుడు మరో నటుడి ద్వారా తమ సిద్ధాంతాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

**ధనుష్‌కు అన్నాడీఎంకే ఆహ్వానం**

రాజకీయాల్లోకి రావడం ఎవరి హక్కు అని డీఎంకే పేర్కొంది. విజయ్ రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ధనుష్ ఎందుకు రాకూడదని ప్రశ్నించింది. మరోవైపు అన్నాడీఎంకే సానుకూలంగా స్పందించింది. యువతలో ధనుష్‌కు ఉన్న ఆదరణను ప్రస్తావిస్తూ, అణగారిన వర్గాల సమస్యలను ప్రతిబింబించే పాత్రల్లో ఆయన నటించారని ప్రశంసించింది. పళనిస్వామి నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకొస్తే పార్టీలోకి ఆహ్వానిస్తామని తెలిపింది.

ఈ పరిణామాలపై ధనుష్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. అభిమానులను కలిసే కార్యక్రమాలకే పరిమితమవుతూ రాజకీయ ప్రవేశంపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

# అమిత్ షా పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

- ఆరేళ్ల నాటి కేసులో నిర్దోషిగా ప్రకటించిన సుల్తాన్‌పూర్ కోర్టు
- 2018 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలతో వివాదం
- బీజేపీ నేత విజయ్ మిశ్రా దాఖలు చేసిన ఫిర్యాదుతో విచారణ
- వాయిస్ శాంపిల్స్ సరిపోల్చాలన్న పిటిషన్లు తిరస్కరణ
- తీర్పు సమయంలో కోర్టుకు హాజరైన లోక్‌సభ ప్రతిపక్ష నేత

**సుల్తాన్‌పూర్, అక్టోబర్ 26:**

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీఎమ్మెల్యే కోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా వెల్లడించారు. తీర్పు వెలువడే సమయంలో రాహుల్ గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు.

2018లో వ్యాఖ్యలతో వివాదం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2018 మే 8న బెంగళూరులో జరిగిన సభలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. అదే ఏడాది ఆగస్టు 4న బీజేపీ నేత, జిల్లా సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని 2023 నవంబర్ 27న కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. 2024 ఫిబ్రవరి 20న కోర్టుకు హాజరైన ఆయనకు బెయిల్ లభించింది. అదే ఏడాది జూలై 26న రాహుల్ వాంగ్మూలాన్ని, అక్టోబర్ 9న ఫిర్యాదుదారు విజయ్ మిశ్రా వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది.



సాక్షుల విచారణ.. వరుస పిటిషన్లు

2025 ఫిబ్రవరి 28న ఫిర్యాదుదారు తరఫు సాక్షి అనిల్ మిశ్రా వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అదే ఏడాది డిసెంబర్ 8న మరో సాక్షి రామచంద్ర దూబే వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసింది. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 20న రాహుల్ గాంధీ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన వాయిస్ శాంపిల్స్‌ను సరిపోల్చాలని విజయ్ మిశ్రా దాఖలు చేసిన పిటిషన్‌ను మేజిస్ట్రేట్ కోర్టు మార్చి 12 తర్వాత విచారించి తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, జూలై 15న అక్కడా చుక్కెదురైంది. సెప్టెంబర్ 10న హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ కూడా తిరస్కరణకు గురైంది.

చివరకు ముగిసిన విచారణ

అక్టోబర్ 6న కేసులో తుది వాదనలు ప్రారంభమై, అక్టోబర్ 12 నాటికి విచారణ పూర్తయింది. అనంతరం సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీఎమ్మెల్యే కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించినట్లు ఆయన న్యాయవాది తెలిపారు. దీంతో 2018లో ప్రారంభమైన పరువు నష్టం కేసు సుదీర్ఘ విచారణకు ముగింపు లభించింది.

# జామియా విద్యార్థుల దీక్షకు పాక్షికంగా తెర

- విద్యార్థి సంఘం ఎన్నికలకు యూనివర్సిటీ అంగీకారం
- సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసుల ఉపసంహరణకు నిర్ణయం
- భద్రతా సిబ్బంది తీరుపై విచారణ కమిటీ ఏర్పాటు
- ఎన్నికల తేదీ ప్రకటించకపోవడంపై విద్యార్థుల అసంతృప్తి
- గేట్ నంబర్ 7 వద్ద కొనసాగుతున్న నిరసన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26:**

జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీలో విద్యార్థుల నిరాహార దీక్షకు పాక్షికంగా తెరపడింది. విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లపై యూనివర్సిటీ యాజమాన్యం అక్టోబర్ 26, 2026న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం, ఆందోళన సందర్భంగా విధించిన సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవడం, భద్రతా సిబ్బంది వ్యవహారంపై విచారణ చేపట్టడం వంటి నిర్ణయాలను ప్రకటించింది. అయితే, ఎన్నికల పోలింగ్ తేదీ ఖరారు కాకపోవడంతో కొందరు విద్యార్థులు నిరసన కొనసాగిస్తున్నారు.

**ఎన్నికలకు రాజ్యాంగం ఆమోదమే కీలకం**

విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌కు యూనివర్సిటీ అంగీకరించింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.డి. మెహతాబ్ ఆలం రిజ్వీ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన 15 రోజుల తర్వాత ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఆ రాజ్యాంగానికి ఎప్పుడు ఆమోదం లభిస్తుందనే దానిపై స్పష్టత లేదు. దీంతో పోలింగ్ తేదీని ఇంకా ప్రకటించలేదు.

**నోటీసుల ఉపసంహరణ.. విచారణ కమిటీ**

ఆందోళన సమయంలో విద్యార్థులపై విధించిన సస్పెన్షన్లను రద్దు చేయడంతో పాటు జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని యూనివర్సిటీ నిర్ణయించింది. అదే సమయంలో, యాజమాన్యానికి పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు, చర్యలు, సోషల్ మీడియా పోస్టులపై విద్యార్థులు బహిరంగంగా క్షమాపణ చెప్పేందుకు అంగీకరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం, సంబంధిత పోస్టులను తొలగించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. విద్యార్థుల నిరసన సమయంలో భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరుపై విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని కూడా యాజమాన్యం నిర్ణయించింది.




**తేదీ ప్రకటించే వరకు ఆందోళన**

యూనివర్సిటీ నిర్ణయాలపై కొంతమంది విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, పోలింగ్ తేదీని ఖరారు చేయకపోవడంపై అభ్యంతరం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గేట్ నంబర్ 7 వద్ద టెంట్లు వేసుకుని నిరసన కొనసాగిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చేవరకు ఆందోళన విరమించబోమని చెబుతున్నారు.

విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన తర్వాతే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన 15 రోజుల గడువు ప్రారంభం కానుంది. దీంతో రాజ్యాంగం ఆమోదం, ఎన్నికల షెడ్యూల్ ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది.

# సిరిసిల్ల దవాఖానకు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు

- సీఎస్ఆర్ నిధులకు కేటీఆర్ చొరవ

**సిరిసిల్ల, అక్టోబర్ 26 :**

సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా దాదాపు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు సమకూరాయి. ఈ పరికరాలను ఆయన సోమవారం ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దవాఖానకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేటీఆర్ ఈ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల దవాఖానలో వైద్య సదుపాయాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ దవాఖానల నిర్వహణ, గతంలో కల్పించిన సదుపాయాల పరిరక్షణపై నిర్లక్ష్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో హాస్పిటల్‌కు వచ్చే రోగుల అవసరాలను గుర్తించి సీఎస్ఆర్ నిధుల ద్వారా సుమారు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వైద్య పరికరాలను సమర్థవంతంగా వినియోగిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని స్థానికులు ఆశిస్తున్నారు.

**ఎన్ హెచ్‌ఎం సిబ్బందికి బీఆర్ఎస్ మద్దతు**

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్‌ఎం) ఉద్యోగులు రెండు వారాలుగా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు, నిరసనలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో జిల్లాలో పనిచేస్తున్న ఎన్ హెచ్‌ఎం ఉద్యోగులు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడిన ఆయన కరోనా సమయంలో సిబ్బంది అందించిన సేవలను అభినందించారు. ఉద్యోగుల డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని పేర్కొంటూ వారి పోరాటానికి బీఆర్ఎస్ నైతిక మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పీఆర్సీ ప్రయోజనాలు కల్పించామని గుర్తు చేశారు. ఎన్ హెచ్‌ఎం రాష్ట్ర కమిటీ నాయకుల డిమాండ్ల అంశాలు పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించి పరిష్కారం కోసం బీఆర్ఎస్ తరఫున ఏం చేయగలమో స్పష్టంగా తెలియజేస్తామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎన్ హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులు తమ పోరాటాన్ని కొనసాగించాలని, ప్రభుత్వం స్పందించేలా ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను వివరించాలని కేటీఆర్ సూచించారు.



## ఇందూరు నుంచి శబరిమలకు పాదయాత్ర




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

శబరిమలకు పాదయాత్రగా వెళ్లడం దైవ నిర్ణయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని అయ్యప్ప ఆలయంలో ఇందూరు శ్రీధర్మశాస్త్ర పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాదయాత్రలో పాల్గొంటున్న అయ్యప్ప స్వాములకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా యాత్ర విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. మొత్తం 40 మంది స్వాములు సుమారు 45 రోజులపాటు పాదయాత్ర చేసి శబరిమలకు చేరుకోనున్నట్లు తెలిపారు. స్వాములంతా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ యాత్రను కొనసాగించాలని సూచించారు. అయ్యప్ప మాల ఎంతో పవిత్రమైనదని, మాలధారణతో పాదయాత్ర చేపట్టడం మరింత కఠినమైన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, గురుస్వాములు గుండయ్య, ఆగమయ్యతోపాటు పాదయాత్రలో పాల్గొంటున్న స్వాములు పాల్గొన్నారు.

## సేవా దృక్పథంతో ముందుకు సాగాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శ్రీ ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కిసాన్ ఫ్యాషన్ మాల్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల నిర్వహణలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. పేదలను ఆదుకుంటూ వారికి అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా యువత వారాంతాల్లో హంగు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ తమకు తోచిన విధంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో గుర్తింపు పొందడమే కాకుండా, నలుగురికి సాయం చేశామనే ఆత్మతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధన్‌పాల్ ప్రణయ్‌కుమార్, డాక్టర్ వినయ్‌కుమార్‌తోపాటు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 121 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, జిల్లా రెవెన్యూ అధికారి గీత, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడం, మరికొందరు ఆలస్యంగా హాజరవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా కార్యస్థానాన్ని విడిచి వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయికుమార్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్, బీసీ సంఘాల నాయకులు బుస్స ఆంజనేయులు, రాజేశ్వర్, బస్సాపూర్ శంకర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు

- ఎల్ నినో ప్రభావంతోనే వర్షా భావ పరిస్థితులు
- రైతులకు అండగా ఉంటాం
- రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశాం
- డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నాగేశ్ రెడ్డి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి నాగేశ్‌రెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత రెండేళ్లలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసిందని నాగేశ్‌రెడ్డి తెలిపారు. అయితే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవలేదని, ప్రపంచంలోని 110 దేశాలతోపాటు భారత్, తెలంగాణలోనూ ఈ ప్రభావం ఉందన్నారు. ప్రకృతి పరిస్థితులను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిందంటూ ప్రతిపక్షాలు విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి తదితర నాయకుల సహకారంతో జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా చేసి, పంట నష్టాలను తగ్గించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో నిజాంసాగర్‌లో 10 టీఎంసీలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 40 టీఎంసీల నీటి నిల్వలు ఉండటం రైతులకు కొంత ఊరటనిచ్చిందన్నారు. గతంలో రాష్ట్రంలో 13 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా, ఈ ఏడాది సుమారు 20 వేల మెగావాట్లకు చేరిందని నాగేశ్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు 300 మెగావాట్ల విద్యుత్ కేటాయింపు ఉన్నప్పటికీ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 750 మెగావాట్ల వరకు వినియోగించామని వివరించారు. రోజువారీగా సగటున 500 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందన్నారు. కరోనా సమయంలోనూ కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించి, అప్పటి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రకృతి వైపరీత్యాలను రాజకీయాలకు ముడిపెట్టి విమర్శలు చేయడం తగదన్నారు. రైతులు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### సన్న వడ్లకు రూ.500 బోనస్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించిన ఘనత తమదేనని నాగేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల వ్యాపారులు సైతం జిల్లాకు వచ్చి రైతుల వద్ద సన్న వడ్లను క్వింటాల్‌కు రూ.3,200 నుంచి రూ.3,400 వరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రెండో పంటగా వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ప్రజలకు తాగునీరు అత్యంత ముఖ్యమని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కోరారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉన్నప్పుడు దానిపై అవగాహన లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతిపక్షాలు సమస్య పరిష్కారానికి సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నగర ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా, అవసరం లేనప్పుడు నల్లాలను తెరిచి ఉంచవద్దని సూచించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ మాట్లాడుతూ.. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెల్లడించిన అంశాలను ప్రజలు గమనించాలని కోరారు. నవంబరు 1న ఢిల్లీలోని రామలీలా మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ శేఖర్‌గౌడ్, నగర మేయర్ ఉమారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు రామకృష్ణ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కౌడప్ శరత్, గాదారి గోపి, రత్నాకర్‌గౌడ్, కోశాధికారి భక్తవత్సలం, సీనియర్ నాయకుడు బాలనర్సయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు రాజా నరేందర్‌గౌడ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గంగారెడ్డి, ప్రవీణ్‌గౌడ్, కార్పొరేటర్లు ఎర్రం గంగాధర్, అహ్మద్, రవి, గణేష్, రఘు, నరేందర్, కిషన్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అపర్ణ, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

- ఎల్ నినో ప్రభావంతో రబీ రైతులను ఆదుకోవాలి
- నిత్యావసర ధరలను నియంత్రించాలి
- కలెక్టర్ కు ఏఐకేఎంఎస్ నాయకుల వినతి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రబీ సీజన్‌లో రైతులను ఆదుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, జొన్న, కుసుమ, ఆవాలు, పెసర, మినుము, శనగ తదితర ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఈ పంటలకు అవసరమైన విత్తనాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా, ఇతర రైతులకు 80 శాతం రాయితీపై అందించాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో తీసుకున్న రుణాల చెల్లింపును వాయిదా వేసి, రబీ సాగు కోసం కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. పశుగ్రాస కొరత నివారణకు గడ్డి విత్తనాలు, దాణాను 80 శాతం రాయితీపై అందించి పాడి రైతులతోపాటు గొర్రెలు, మేకల పెంపకందారులను ఆదుకోవాలని కోరారు. యంత్రలక్ష్మి పథకం ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల వ్యవసాయ యంత్రాలను 80 శాతం రాయితీతో అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను విస్తరించి, ఒక్కొక్కరికి ఏడాదికి 200 రోజుల పని కల్పించడంతోపాటు రోజుకు రూ.700 కూలి చెల్లించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ వ్యాపారులు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం ఒక్కొక్కరికి అందిస్తున్న ఆరు కిలోల బియ్యాన్ని 12 కిలోలకు పెంచాలని భూమయ్య, సాయిరెడ్డి కోరారు. బియ్యంతోపాటు పప్పులు, నూనెలు, చింతపండు తదితర 12 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్ సమ్మాన్ నిధిని రూ.12 వేల నుంచి రూ.20 వేలకు పెంచాలని, అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఏటా ఇస్తామని ప్రకటించిన రూ.12 వేల మొత్తాన్ని బకాయిలతో సహా చెల్లించాలని, వ్యవసాయానికి నిరంతరంగా 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. మంచిప్ప 21వ ప్యాకేజీకి అవసరమైన నిధులు కేటాయించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు కోరారు. కరువు నివారణ చర్యల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న విపత్తు నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి. సాయిలు, ఎల్. పర్వన్న, సహాయ కార్యదర్శి దేదావత్ బన్సీ, జిల్లా నాయకులు ఎస్. అనంతయ్య, ఎస్. విట్టల్, నర్సాగౌడ్, రాపాని గంగాధర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బి. భూమయ్య, డి. మల్లికార్జున్, ఎం. శివకుమార్, జేపీ గంగాధర్, శంకర్, ఎలప్ప, అశోక్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

## చోలా ఫైనాన్స్ అధిక వడ్డీలపై చర్యలు తీసుకోవాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**




ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ చోలా ఫైనాన్స్ అధిక వడ్డీలు వసూలు చేస్తోందని, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను స్వాధీనం చేసుకుంటోందని ఆరోపిస్తూ యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (యూటీయూసీ) జిల్లా కమిటీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంస్థ వ్యవహారాలపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా యూటీయూసీ జిల్లా కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ.. చోలా ఫైనాన్స్ అధిక వడ్డీరేట్లు వసూలు చేస్తూ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేద, మధ్యతరగతి వినియోగదారులు సంస్థ తీరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మాట్లాడుకుందామని పిలిపించిన ఫైనాన్స్ సంస్థ సిబ్బంది, మూడు నెలల ఈఎంఐల గడువు కూడా పూర్తికాకముందే ఆటోను స్వాధీనం చేసుకున్నారని రాములు ఆరోపించారు. అనంతరం రూ.2,000 సీజ్ ఛార్జీలు వసూలు చేయడంతోపాటు, కేవలం రెండు గంటల వ్యవధికే పార్కింగ్ ఛార్జీలు విధించడం అన్యాయమని పేర్కొన్నారు. వాహన రుణాల విషయంలో ఫైనాన్స్ సంస్థలు పాటించాల్సిన నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. పేద ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు రుణాల ద్వారా జీవనోపాధి పొందుతున్నారని, ముందస్తు సమాచారం లేకుండా వాహనాలను స్వాధీనం చేసుకోవడం వల్ల వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని రాములు అన్నారు. రుణాల వసూళ్ల పేరుతో వినియోగదారులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని పేర్కొన్నారు. చోలా ఫైనాన్స్ సంస్థపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని యూటీయూసీ జిల్లా కమిటీ కలెక్టర్‌ను కోరింది. అదనపు వసూళ్లను నిలిపివేసి బాధిత వినియోగదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో యూటీయూసీ నాయకులు గోపాల్, నరేష్ పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి: ఈఈ స్వప్న

**కామారెడ్డి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం)**



ఎల్‌నినో ప్రభావంతో సింగూరు జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బల్క్ నీటి సరఫరాను రోజు విడిచి రోజు అందించాలని నిర్ణయించినట్లు బాన్సువాడ మిషన్ భగీరథ గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్. స్వప్న తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో నీటి సరఫరా షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ నెల 28న ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు, 29న బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాలకు బల్క్ నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రజలు తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కోరారు. నీటి కొరతను అధిగమించేందుకు ప్రజలందరూ సహకరించాలని ఈఈ ఎస్. స్వప్న విజ్ఞప్తి చేశారు.

## వెంగలపాడులో భూ రీసర్వే ప్రారంభం



**ఇందల్వాయి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ఇందల్వాయి మండలంలోని వెంగలపాడు గ్రామపంచాయతీ పరిధిలో భూ రీసర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ బాలయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటివరకు సర్వే చేయించుకోని వారితోపాటు ప్రతి ఒక్కరి భూములను సమగ్రంగా సర్వే చేసి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భూ రీసర్వే ద్వారా రైతులు తమ భూముల సరిహద్దులను కచ్చితంగా తెలుసుకోవచ్చని, భూములకు సంబంధించిన పట్టా వివరాలను కూడా సరిచూసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రైతులు, గ్రామస్తులు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అధికారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ ప్రవీణ్, జీపీఓలు ప్రమోద్, రాజేశ్వర్‌తోపాటు రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల మార్కౌట్, ఉపాధి పనులు వేగవంతం చేయాలి



**కామారెడ్డి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 79 ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మార్కౌట్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. విజిబి–జీ రామ్ జీ పథకం కింద చేపట్టిన పనులను ప్రతి ప్రాంతంలో 20 నుంచి 30 మంది కూలీలతో నిర్వహించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి. విక్టర్, ఎన్. వై. గిరి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్, జిల్లా రెవెన్యూ అధికారి పాండు పాల్గొన్నారు.

## మైతాపూర్ శ్రీ గిరిగుట్టపై వైభవంగా గిరి ప్రదక్షిణ



**రాయికల్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని శ్రీగిరిగుట్టపై వెలసిన శ్రీ కనక దుర్గాదేవి ఆలయం వద్ద సోమవారం పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు క్యాసునూరి మఠం జగదేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తులు భజనలు, భక్తిగీతాలు ఆలపిస్తూ ప్రదక్షిణ ప్రారంభించారు. పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేయడం ఆధ్యాత్మికంగా విశేషమైనదని భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో మహిళలు మంగళహారతులతో అమ్మవారికి నీరాజనాలు పలుకుతూ, భక్తిగీతాలు ఆలపించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని శ్రీగిరిగుట్ట చుట్టూ సుమారు కిలోమీటరు మేర ప్రదక్షిణ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మను తలపించేలా మైతాపూర్ శ్రీగిరిగుట్టపై ఉన్న అమ్మవారి ఆలయం భక్తుల విశ్వాస కేంద్రంగా నిలుస్తోందని గ్రామస్తులు తెలిపారు. ఆలయం క్రమంగా అభివృద్ధి చెందుతూ భక్తులను ఆకర్షిస్తోందన్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించి ఆశీస్సులు పొందారు. అరుణాచలం, సింహాచలం, శ్రీశైలం, యాదగిరిగుట్ట, కొండగట్టు వంటి పుణ్యక్షేత్రాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల తరహాలో మైతాపూర్ శ్రీగిరిగుట్టపై కూడా ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ నిర్వహించేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో గిరిగుట్ట ప్రాంతం ఆధ్యాత్మిక సందడిని సంతరించుకుంది. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోపి మాధవి రాజరెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపి రాజరెడ్డి, ఉపసర్పంచ్ దొంగ ప్రణయ్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివనితి రమ్య కిష్టయ్య, వార్డు సభ్యులు బుస గంగ మల్లయ్య, అనుమల్ల రమ, సత్యనారాయణ, నేమిళ్ల లత, స్వామిరెడ్డి, కౌన్సిలర్ పుర్రె శ్రీధర్, దొంగ లింగారెడ్డి, కొల్ల విజయ కృష్ణారెడ్డి, పాలడుగు సూర్యవ్వ, సంజీవరెడ్డి, డాక్టర్ లింగారెడ్డి, గంప ఆనందం, కొల్ల వేణుగోపాల్, రాజేశం, బాలయ్య, సతీష్, ఆనందం, చందు, జిల్లాల సుధాకర్, శివనందం, అనిల్, లత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

**చేగుంట, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

మెదక్ జిల్లా చేగుంట మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన టేకి నర్సింలు (21) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత రెండేళ్లుగా మద్యానికి అలవాటు పడ్డాడు. ఆదివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన నర్సింలు తల్లి యాదమ్మతో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం వడియారం రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తల్లి టేకి యాదమ్మ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మాధవనగర్ ఆర్వోబీ పనుల జాప్యంపై నేడు నిరసన దీక్ష

- బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి పటేల్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ మంగళవారం (అక్టోబరు 27) ఉదయం 10 గంటలకు బ్రిడ్జి వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి పటేల్ తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇందూరు ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇది కేవలం బ్రిడ్జి సమస్య మాత్రమే కాదని, జిల్లా ప్రజలకు కీలకమైన సమస్యగా మారిందని అన్నారు. భారతీయ జనతా పార్టీ ఇందూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ నిరసన దీక్షకు ఇందూరు ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డితోపాటు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

మాధవనగర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ అనేక ప్రయత్నాలు చేశారని దినేశ్ కులాచారి పటేల్ తెలిపారు.



కేంద్ర ప్రభుత్వ వాటాను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం కారణంగా పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ జాప్యం కొనసాగుతోందని ఆరోపించారు. మాధవనగర్, అర్సపల్లి రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలు ఆలస్యం కావడానికి రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వమే కారణమని విమర్శించారు. గతంలో మాధవనగర్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపీ అర్వింద్ దీక్ష చేపట్టిన సమయంలో తనతోపాటు పార్టీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కోర్టుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని విరమించబోమని స్పష్టం చేశారు. మాధవనగర్ బ్రిడ్జికి సంబంధించి అదనంగా సుమారు రూ.9 కోట్ల నిధుల ప్రతిపాదనపై ఎంపీ ధర్మపురి అర్వింద్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి చర్చించారని దినేశ్ తెలిపారు. ఆ నిధుల ఫైలును ఆర్థిక శాఖకు పంపించినప్పటికీ రెండేళ్లుగా పెండింగ్‌లో ఉంచి నిధుల విడుదలలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, పూర్తిగా కేంద్ర నిధులతో చేపడుతున్న అర్సపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణను పూర్తి చేసి అప్పగించాలని కోరుతున్నామని తెలిపారు. ఎంపీ అర్వింద్ దీక్షకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే నిధులు విడుదల చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ప్రకటించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మాధవనగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని, పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని దినేశ్ కులాచారి పటేల్ డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షకు నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాభివృద్ధి కమిటీలు (వీడీసీలు), ఆటో యూనియన్లు, వర్తక, వ్యాపార సంఘాలు, కుల సంఘాల నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పెట్రోల్ బంకుల యాజమాన్యాలు, వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

**కామారెడ్డి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

చిన్నారుల హక్కులను పరిరక్షించడంతోపాటు, బాలలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. నాగరాణి సూచించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చిన్న మల్లారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో సోమవారం 'సురక్షా బచ్పన్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. బాలలపై లైంగిక వేధింపులు, దాడులు, ఇతర లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం–2012 రూపొందించబడిందని తెలిపారు. విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, అపరిచితుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడినా, బెదిరించినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఆన్‌లైన్ వేధింపులు, అనుమానాస్పద సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. బాల్యవివాహాల




నిషేధం, బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు అందిస్తామని నాగరాణి తెలిపారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు సంస్థను సంప్రదించాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సమన్వయకర్త స్వరూప, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త మోహన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాయి రెడ్డి, నళిని దేవి, బాలల పరిరక్షణ ఉపాధ్యాయులు సుశీల, సంగీత, ఉపాధ్యాయులు నర్సారెడ్డి, చిరంజీవి, రాజ్యలక్ష్మి , స్వప్న, కీర్తి మాలిని, ఇతర ఉపాధ్యాయులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా యువజనోత్సవానికి సన్నాహాలు

**కామారెడ్డి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

యువతలోని సృజనాత్మకత, కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నవంబరు 4న కామారెడ్డి కళాభారతి ఆడిటోరియంలో జిల్లా స్థాయి యువజనోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. 30వ జాతీయ యువజనోత్సవం–2027లో పాల్గొనే ప్రతిభావంతులను ఎంపిక చేయడంలో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జానపద నృత్యం, జానపద గానం, చిత్రలేఖనం, కవితా రచన, వీధి నాటకం విభాగాల్లో పోటీలు ఉంటాయని అధికారి వెల్లడించారు. 15 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువత పాల్గొనవచ్చని, ఒక్కొక్కరు ఒక విభాగంలో మాత్రమే పోటీ చేయాలని సూచించారు. చిత్రలేఖన పోటీలో వ్యసన రహిత యువత, ఆరోగ్యకరమైన జీవనశైలి అంశాలపై చిత్రాలను ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విజేతలకు డిసెంబరు మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి యువజనోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని రంగ వెంకటేశ్వర్ గౌడ్ వివరించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారు 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే 30వ జాతీయ యువజనోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, యువజన సంఘాలు, సాంస్కృతిక సంస్థలు అర్హులైన యువతను గుర్తించి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు.

# ఏటీఎం దొంగల ముఠా గుట్టురట్టు




**కామారెడ్డి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి నగదు దోచుకుంటున్న అంతర్రాష్ట్ర ముఠా కేసులో కామారెడ్డి పోలీసులు కీలక పురోగతి సాధించారు. గాంధారి ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.25,45,900 చోరీ చేసిన కేసులో రాజస్థాన్‌కు చెందిన రషీద్ (30)ను అరెస్టు చేశారు. అతడి నుంచి నగదు, స్కార్పియో వాహనం, గ్యాస్ కట్టింగ్ పరికరాలు, సెల్‌ఫోన్లు, కత్తులు, నకిలీ నంబర్ ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర సోమవారం కేసు వివరాలను వెల్లడించారు. గాంధారి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను అక్టోబరు 10, 11 తేదీల మధ్య రాత్రి దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. మాస్కులు, టోపీలు, నైటీలు ధరించి ఏటీఎం వద్దకు చేరుకున్నారు. గుర్తింపు లభించకుండా సీసీటీవీ కెమెరాలపై నల్లరంగు స్ప్రే చల్లారు. అనంతరం గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి, నగదు ఉన్న ఐదు బాక్సులను నల్లరంగు స్కార్పియోలో వేసుకుని పరారయ్యారు. ఈ ఘటనపై గాంధారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులు వినియోగించిన వాహనాన్ని గుర్తించారు. అసలు రిజిస్ట్రేషన్ నంబర్‌కు బదులుగా ఇతర వాహనాల నంబర్ ప్లేట్లను అమర్చి ప్రయాణించినట్లు గుర్తించారు. మహారాష్ట్ర మీదుగా రాజస్థాన్ వైపు పారిపోయినట్లు తెలుసుకుని ఆయా రాష్ట్రాల పోలీసులకు సమాచారం అందించారు. రాజస్థాన్‌లోని చేచాట్ పోలీసులు స్కార్పియోను అడ్డుకునేందుకు ప్రయత్నించగా, టైరు దెబ్బతినడంతో నిందితులు వాహనాన్ని వదిలి నగదు బ్యాగుతో



పరారయ్యారు. దీంతో ప్రత్యేక పోలీసు బృందాలు అక్కడికి చేరుకుని గాలింపు ముమ్మరం చేశాయి. అక్టోబరు 20న బరోడామేవ్ సమీపంలోని భరత్‌పూర్ రహదారిపై బస్సు కోసం వేచి ఉన్న రషీద్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నాయి. న్యాయస్థానం నుంచి ట్రాన్సిట్ వారెంట్ పొంది అతడిని కామారెడ్డికి తీసుకొచ్చారు. అక్టోబరు 21న చేచాట్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న స్కార్పియోను పరిశీలించి గ్యాస్ కట్టింగ్ పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్ ఉపకరణాలు, పనిముట్లు, కత్తులు, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. రూ.29,400 నగదు, రెండు సెల్‌ఫోన్లు, నకిలీ నంబర్ ప్లేట్లు సహా పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. విచారణలో నిందితులు గత సెప్టెంబరులో కరీంనగర్ ప్రాంతంలోని రెండు ఎస్‌బీఐ ఏటీఎంల వద్ద కూడా చోరీలకు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, పుష్పరాజ్, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సీసీఎస్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, లక్ష్మీకాంత్, సదాశివనగర్ కానిస్టేబుల్ అజార్‌ను ఎస్పీ అభినందించారు

## ప్రజావాణికి స్పందన కరువు
## ఇందల్వాయిలో ఒకే ఒక్క దరఖాస్తు

**ఇందల్వాయి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**



మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సోమవారం కేవలం ఒకే ఒక్క దరఖాస్తు రావడం గమనార్హం. ఈ పరి స్థితిపై ఎంపీడీవో అనంతరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సమస్యలు లేవని భావించాలా? లేక ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం తగ్గిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే కార్యక్రమానికి కొందరు అధికారులు హాజరుకాకపోవడం విచారకరమన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ఒక దరఖాస్తు అందిందని, దానిని సంబంధిత అధికారులకు పంపించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి మంచి వేదిక అని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చి తమ సమస్యలను చెప్పుకున్నా పట్టించుకునే వారు లేరనే భావన కలగకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణికి సంబంధిత అధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి కార్యక్రమానికి గైర్హాజరయ్యే అధికారుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలి

**కామారెడ్డి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సమర్థంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతి, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, ప్రో డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఎన్నికల సూపరింటెండెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

## బీరు సీసాలతో ఇంటిపై దాడి.. కుటుంబం బెంబేలు

**ఆర్మూర్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ఆర్మూర్‌లోని టీచర్స్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి కొందరు యువకులు బీరు సీసాలతో ఓ ఇంటిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో ఇంట్లోని చిన్నారులు, కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సుమారు 15 నుంచి 20 మంది యువకులు ఖాళీ బీరు సీసాలతో దాడి చేసి భయానక వాతావరణం సృష్టించారని బాధితుడు మత్తయి తెలిపారు. టీచర్స్ కాలనీలోని చర్చి కాంపౌండ్ పరిసరాల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు 60 నుంచి 70 ఖాళీ బీరు సీసాలతో యువకులు తమ ఇంటిపై దాడి చేసినట్లు మత్తయి ఆరోపించారు. గతంలో తమ మధ్య చిన్నచిన్న గొడవలు జరిగాయని, ఈ నేపథ్యంలో తాము వారి ఇంటికి వెళ్లి క్షమాపణలు కూడా చెప్పామని వివరించారు. అయినప్పటికీ ఆదివారం అర్ధరాత్రి యువకులు మద్యం మత్తులో వచ్చి దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. యువకులు ఇంటిపై దాడి చేస్తున్న సమయంలో లోపలి నుంచి వీడియో తీస్తుండగా వారు అక్కడి నుంచి పారిపోయారని బాధితుడు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించామని, పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వెళ్లిన తర్వాత యువకులు మళ్లీ వచ్చి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బాల్కొండ గ్రామపంచాయతీ నిధుల వివరాలపై ఆర్టీఐ దరఖాస్తు



**ఆర్మూర్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం) :**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ లోని గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు, వాటి ఖర్చుల వివరాలు వెల్లడించాలని కోరుతూ అంజా గౌడ్ మండల పౌర సమాచార అధికారికి దరఖాస్తు సమర్పించారు. 2025 డిసెంబర్ 17 నుంచి 2026 అక్టోబర్ 26 వరకు బాల్కొండ గ్రామపంచాయతీకి ప్రభుత్వం, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా వచ్చిన నిధుల పూర్తి వివరాలను అందించాలని కోరినట్లు తెలిపారు. సదరు కాలంలో గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన పనులు, వాటికి వెచ్చించిన మొత్తాలు, ఏయే పథకాల కింద ఖర్చులు చేశారనే వివరాలను ఇవ్వాలని దరఖాస్తులో పేర్కొన్నారు. పనులకు సంబంధించిన బిల్లులు, వోచర్లు, చెక్కుల వివరాలతోపాటు కాంట్రాక్టర్లు, సంబంధిత వ్యక్తులకు చెల్లించిన మొత్తాల సమాచారాన్ని అందించాలని కోరారు. అదేవిధంగా 2025 డిసెంబర్ 17 నాటికి గ్రామపంచాయతీ ఖాతాలో ఉన్న నిధుల నిల్వ, 2026 అక్టోబరు 26 నాటికి మిగిలి ఉన్న నిధుల వివరాలను వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిధులు ప్రజా అవసరాలకు ఏ విధంగా వినియోగించారో తెలుసుకునేందుకు నిధుల రాక, ఖర్చుల వివరాలను విడివిడిగా అందించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించినట్లు అంజా గౌడ్ తెలిపారు.

## బకాయి అద్దె ఇప్పించి.. దుకాణం ఖాళీ చేయించండి




**ఆర్మూర్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

తనకు రావాల్సిన దుకాణం అద్దె ఇప్పించి, అద్దెకు ఉన్నవారితో దుకాణాన్ని ఖాళీ చేయించి న్యాయం చేయాలని కోరుతూ ఆర్మూర్‌కు చెందిన బారెడ్ సురేందర్ సోమవారం సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతిపత్రం సమర్పించారు. ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ పట్టణంలోని పంత్ రోడ్డులో ఉన్న తన దుకాణం నంబరు 1-2-111/4ను వ్యాపారం కోసం పులి శ్రీనివాస్, ఆయన భార్య పులి స్వర్ణలతకు బ్యూటీ పార్లర్ నిర్వహణ నిమిత్తం అద్దెకు ఇచ్చారు. అయితే కొంతకాలంగా అద్దె చెల్లించడం లేదని, దుకాణం ఖాళీ చేయాలని కోరినా స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. అడ్వాన్స్ మొత్తాన్ని మినహాయించిన తర్వాత కూడా పది నెలలకు సంబంధించి నెలకు రూ.15 వేల చొప్పున మొత్తం రూ.1.50 లక్షల అద్దె బకాయి ఉందని తెలిపారు. ఈ విషయంపై గతంలో రెండుసార్లు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. 2026 జులై 29న ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సమక్షంలో ఒప్పందం చేసుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని సురేందర్ వాపోయారు. దుకాణం ఖాళీ చేయాలని కోరితే బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తనకు రావాల్సిన అద్దె బకాయిలు ఇప్పించి, దుకాణాన్ని ఖాళీ చేయించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**మెదక్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ప్రజావాణిలో ప్రజల నుంచి అందే ప్రతి దరఖాస్తుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణ విచారణ చేపట్టి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 69 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో భూభారతికి సంబంధించి 26, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 7, పింఛన్ల కోసం ఒకటి, ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా సిద్దేశ్వర స్వామి పల్లకీ





**ఆర్మూర్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ నవనాథ సిద్ధుల గుట్టపై సోమవారం పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో గుట్టపైకి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గుట్టపై ఉన్న దత్తాత్రేయ స్వామి, దుర్గామాత, రామాల యం, అయ్యప్ప స్వామి, ఎల్లమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోనెల హరి రఘు, పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుట్టపైకి చేరుకుని శివాలయం లో అభిషేకాలు, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి పట్టు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో రామాలయం నుంచి కోనేరు వరకు సిద్దేశ్వర స్వామివారి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులు భజనలు, భక్తి గీతాలు ఆలపిస్తూ, నృత్యాలు చేస్తూ పల్లకిని కోనేరు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి హారతి సమర్పించిన అనంతరం పల్లకిని తిరిగి రామాలయం వద్దకు తీసుకొచ్చారు. గుట్టపైకి విచ్చేసిన భక్తులంద రికీ పండిట్ అలేఖ్య శ్రీకాంత్, వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో బి. సుమన్, పి.సి. గంగారెడ్డి, చరణ్ రెడ్డి, జిమ్మీ రవి, బట్టు శంకర్, కొంతం మంజుల మురళి, శ్రీనివాస్, నరేష్ అజారి, సతీష్, సిద్ధగుట్ట సేవా సమితి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి



**చేగుంట, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

పరిశ్రమల నిర్వహణలో ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని జీవక స్టీల్ ఫ్యాక్టరీ వల్ల గాలి, నీరు, భూమి కలుషితమవుతున్నాయని ఆరోపిస్తూ స్థానిక గ్రామాల ప్రజలు చేపట్టిన నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి మద్దతు తెలిపారు. జీవక స్టీల్ ఫ్యాక్టరీ కారణంగా పర్యావరణం కలుషితమవుతోందని ఆరోపిస్తూ అనంత సాగర్, ఉల్లి తిమ్మాయిపల్లి, కొండాపూర్, గొల్లపల్లి, చేగుంట, బోనాల, పులిమామిడి, పొలంపల్లి, చిన్న శివనూర్, కర్ణాల్‌పల్లి, మక్కారాజ్‌పేట తదితర గ్రామాల రైతులు, ప్రజలు గత రెండు రోజులుగా ఫ్యాక్టరీ ఎదుట వంటావార్పు, రాస్తారోకో నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, తాము పారిశ్రామిక అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అయితే పరిశ్రమల వల్ల స్థానిక ప్రజల ఆరోగ్యం, సాగునీటికి ఎలాంటి నష్టం కలగకుండా పటిష్టమైన కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల జీవన ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీ పడకూడదని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు అందించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పరిశ్రమలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, సీఎస్ఆర్ నిధులతో పరిసర గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. నిరసన నేపథ్యంలో ఫ్యాక్టరీ యజమాని మోహన్ అగర్వాల్ ప్రజల సమక్షంలో ఎమ్మెల్యేతో చర్చించారు. కాలుష్య నివారణ చర్యలు చేపట్టడం, స్థానికులకు ఉపాధి కల్పించడం, సీఎస్ఆర్ నిధులు కేటాయించడం వంటి అంశాలపై లిఖితపూర్వక హామీ ఇచ్చినట్లు సమాచారం. యాజమాన్యం హామీ నేపథ్యంలో గ్రామస్థులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. అయితే, ఇచ్చిన హామీలను నిర్ణీత గడువులోగా అమలు చేయకపోతే ప్రజల పక్షాన తిరిగి పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

**మెదక్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**



మెదక్ నియోజకవర్గంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించి, ఆర్థికంగా, సామాజికంగా భరోసా కల్పించడమే ప్రధాన లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. సోమవారం నార్సింగి, చిన్న శంకరంపేట, మెదక్ రూరల్, హవేలీ ఘనపూర్ మండలాలతో పాటు మెదక్ పట్టణంలో ఆయన విస్తృతంగా పర్యటించి లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల పత్రాలను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రొసీడింగ్స్ పత్రాలను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. నార్సింగి రైతు వేదిక, చిన్న శంకరంపేటలోని రాదేశాం ఫంక్షన్ హాల్, మక్త భూపతిపూర్‌లోని మున్నూరు కాపు భవనం, మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఈ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడంలో సొంత ఇల్లు ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దళారుల ప్రమేయం లేకుండా అర్హులైన పేదలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**చేగుంట, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

చేగుంట మండలంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. నూతనంగా చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన కాశబోయిన భాస్కర్ సోమవారం హైదరాబాద్‌లోని కొంపల్లిలో ఉన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి భాస్కర్‌ను శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాశబోయిన భాస్కర్ మాట్లాడుతూ, నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం చొరవ చూపుతానని భాస్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు.

## లోటస్ స్మార్ట్ స్కూల్ వ్యవస్థాపకురాలు అంబికా పవార్‌కు 'విజనరీ ఎడ్యుకేటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు



**ఆర్మూర్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న లోటస్ స్మార్ట్ స్కూల్ వ్యవస్థాపకురాలు అంబికా పవార్‌కు ప్రతిష్ఠాత్మకమైన 'విజనరీ ఎడ్యుకేటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉన్న పీబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం యూనిక్ లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రగతి రత్న అవార్డుల' కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. యూనిక్ లైఫ్ వ్యవస్థాపకుడు వేణు కళ్యాణ్, ప్రముఖ సినీ నటి శ్రియా శరణ్ చేతుల మీదుగా అంబికా పవార్ అవార్డును స్వీకరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, జీవితానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడంపై అంబికా పవార్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చిన్నారులకు ప్రేమపూర్వకమైన విద్యను అందిస్తూ, ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, ఆధునిక సాంకేతికతను పాఠశాలలో వినియోగించడం వంటి అంశాలకు ఆమె ప్రాధాన్యత ఇస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని భావిస్తూ ముందుకు సాగుతున్నారు. విద్యను కేవలం పుస్తక పాఠాలకే పరిమితం చేయకుండా, మంచి వ్యక్తిత్వం, నైతిక విలువలు కలిగిన పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అంబికా పవార్ తెలిపారు. ఈ అవార్డు తన విద్యా సేవలకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని, భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ మరింత నాణ్యమైన విద్యను అందిస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టులు సుధీర్ సాంద్ర, అరికెళ్ల రాఘవేంద్ర, బ్రదర్ షఫీతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## ఐదుగురికి మొబైల్ ఫోన్ల అప్పగింత



**ఆర్మూర్, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి, బాధితులకు తిరిగి అప్పగించినట్లు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో మొబైల్ ఫోన్లను సేకరించి, ఐదుగురు బాధితులు వెంకటలక్ష్మి, సారయ్య, కుమార్, సంతోష్, ఎల్లుల్ల నందినిలకు ఫోన్లను అప్పగించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

## కానిస్టేబుల్ గాజుల సౌమ్యకు ఘన నివాళి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజా శంఖారావం):**

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్యకు ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (డీపీఈవో) కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె సేవలను స్మరించుకున్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నందగోపాల్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో గాజుల సౌమ్య కనబరిచిన తెగువ, త్యాగం ఎక్సైజ్ శాఖలోని ప్రతి ఒక్కరికీ నిరంతరం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎక్సైజ్ నేరాలను మూలాల నుంచి నిర్మూలించేందుకు అధికారులు, సిబ్బంది పూర్తి అంకితభావంతో పనిచేయడమే అమరురాలు సౌమ్యకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఆమె కుటుంబానికి ఎక్సైజ్ శాఖతో పాటు ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాజుల సౌమ్య కుటుంబానికి సత్వర సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ/ఎక్సైజ్), ఎక్సైజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నందగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ వి. నర్సయ్య, నిజామాబాద్ ట్రైనీ ఏఈఎస్ గాయత్రి, ఎస్‌హెచ్‌వో సరిత, బోధన్ ఎస్‌హెచ్‌వో భాస్కర్ రావు, భీమ్‌గల్ ఎస్‌హెచ్‌వో చంద్రమోహన్, నిజామాబాద్ ఎస్సై సంజీవ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే హెచ్‌సీ అండ్ ఈసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ. రవికుమార్, జోనల్ అధ్యక్షుడు పవార్ కైలాష్, జిల్లా అధ్యక్షుడు సునీల్ కుమార్, టీఎన్జీవోస్ ఎక్సైజ్ సెంట్రల్ ఫోరమ్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు, సంఘాల ప్రతినిధులు పాల్గొని గాజుల సౌమ్యకు నివాళులర్పించారు.




# జైలర్-2.. తెలుగులోనే 100 కోట్లు!

బాక్సాఫీస్ దగ్గర 'తలైవా' సునామీ సృష్టిస్తున్నారు. వయసుతో పనేలేదని, వెండితెరపై తన మేనియా ఎప్పటికీ తగ్గదని నిరూపిస్తూ సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన విశ్వరూపం చూపించారు. ఆయన నటించిన లేటెస్ట్ సెన్సేషన్ 'జైలర్ 2' బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌లో ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్కును దాటేసి సరికొత్త సంచలనానికి తెరతీసింది. ఒక తమిళ హీరో సినిమా డబ్బింగ్ వెర్షన్ తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ఈ స్థాయిలో విధ్వంసం సృష్టించడం ట్రేడ్ పండితులనే ఆశ్చర్యపరుస్తోంది. చాలామంది డబ్బింగ్ హీరోల సినిమాలు వస్తుంటాయి పోతుంటాయి.. కానీ రజనీకాంత్ వస్తే ఆ వైబ్రేషనే వేరు. తెలుగు ఆడియన్స్ ఆయన్ను ఎంతగా సొంతం చేసుకున్నారో 'జైలర్ 2' వసూళ్లు మరోసారి కళ్లకు కట్టాయి. మొదటి రోజే వచ్చిన పాజిటివ్ టాక్‌తో థియేటర్లన్నీ హౌస్‌ఫుల్ బోర్డులతో దద్దరిల్లిపోయాయి. ఈ వంద కోట్ల మార్క్‌తో రజనీకాంత్ సౌత్ ఇండియాలోనే అరుదైన మైలురాయిని చేరుకున్నారు. కేవలం తెలుగు వెర్షన్ ద్వారానే నాలుగు సార్లు రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఏకైక తమిళ హీరోగా రికార్డులకెక్కారు. ఇతర భాషా స్టార్లకు తెలుగులో ఒకట్రెండు సినిమాలు ఆడటం చూశాం.. కానీ నాలుగు సార్లు సెంచరీ కొట్టడం ఒక్క రజనీకాంత్‌కే చెల్లిందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్క్రీన్‌పై రజనీ స్వాగ్, నెల్సన్ స్టైలిష్ మాస్ టేకింగ్, థియేటర్లలో ఈలలు వేయించే యాక్షన్ సీన్స్ తెలుగు ప్రేక్షకులకు పూనకాలు తెప్పించాయి. బాక్సాఫీస్ దగ్గర రజనీ ర్యాంపేజ్ ఇంకా కొనసాగుతుండటంతో ఫుల్ రన్‌లో 'జైలర్ 2' మరిన్ని పాత రికార్డులను బద్దలు కొట్టడం ఖాయంగా కనిపిస్తోందని అంటున్నారు.



# అజిత్ హీరోయిన్‌గా కయాదు లోహర్?

తమిళ స్టార్ హీరో అజిత్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఆయన నటించనున్న 64వ చిత్రానికి 'డేర్ డెవిల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నవంబర్ 2 నుంచి షూటింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత అజిత్ మరోసారి దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో కలిసి పనిచేయనున్నారు. నిర్మాతల విషయంలో నెలకొన్న సందిగ్ధత, అజిత్ కార్ రేసింగ్ కార్యక్రమాల కారణంగా ఈ సినిమా ఆలస్యమైంది. ఈ చిత్రానికి అజిత్ స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మొదట హీరోయిన్‌గా శ్రీలీల పేరు వినిపించినప్పటికీ, ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా ఆమె స్థానంలో కయాదు లోహర్ నటించనున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. అయితే చిత్ర బృందం దీనిపై అధికారికంగా స్పందించలేదు. మరోవైపు అధిక్ రవిచంద్రన్ తన సినిమాల్లో హీరోయిన్ పాత్రకు 'రమ్య' అనే పేరు పెట్టడం ప్రత్యేకతగా కొనసాగుతోంది. 'డేర్ డెవిల్'లోనూ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? కయాదు లోహర్ హీరోయిన్‌గా ఖరారవుతారా? అన్నది అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టత రానుంది.

# మా వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దు: రష్మిక



విజయ్ దేవరకొండతో తన వైవాహిక బంధంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలకు నటి రష్మిక స్పందించారు. తమ వ్యక్తిగత జీవితంపై పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఊహాగానాలు చేయొద్దని, ఎడిట్ చేసిన వీడియోలు, అసంపూర్ణ సమాచారంతో తీర్పులు ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు. ఇటీవల 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో పాల్గొన్న విజయ్.. రష్మిక తనను పెళ్లి చేసుకోమని వందసార్లు అడిగిందని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విజయ్‌ను విమర్శిస్తూ నెట్టింట పోస్టులు రావడంతో రష్మిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. పెళ్లి విషయంలో నిర్ణయం తీసుకోవడానికి విజయ్ సమయం తీసుకోవడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని, జీవితంలోని కష్టసుఖాలను కలిసి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామో తెలుసుకోవడం ముఖ్యమని రష్మిక అన్నారు. విజయ్‌పై తనకు ఎంతో ప్రేమ ఉందని, ఇద్దరూ పరస్పర అంగీకారంతో ఒకరినొకరు జీవిత భాగస్వాములుగా ఎంచుకున్నామని తెలిపారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు విజయ్ అండగా నిలిచారని, ఇప్పటికీ ఆ మద్దతు కొనసాగుతోందని వెల్లడించారు. ప్రస్తుతం తన జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని పేర్కొంటూ, తమ కుటుంబం గురించి తెలియకుండా ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వేధింపులతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా తనను ఆదరిస్తున్న అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.



# రవిబాబు హారర్ సినిమాలో బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్!

టాలీవుడ్‌లో ఓ క్రేజీ కాంబినేషన్ తెరపైకి వచ్చింది. వైవిధ్యమైన కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవిబాబు.. ఓ హారర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అదే నిజమైతే దాదాపు 17 ఏళ్ల తర్వాత కంగనా మళ్లీ తెలుగు తెరపై కనిపించనున్నట్టే! విభిన్నమైన కథాంశాలు, విలక్షణమైన మేకింగ్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం దర్శకుడు రవిబాబు శైలి. ఇటీవల 'రేజర్'తో వార్తల్లో నిలిచిన ఆయన.. ఇప్పుడు హారర్ జానర్‌లో మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్టులో కంగనా రనౌత్ నటించనున్నారనే ప్రచారం ఈ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా సాగుతోందని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తల్లో నిజమెంత? కంగనా నిజంగానే రవిబాబు సినిమాలో నటిస్తున్నారా? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు అధికారిక సమాధానం లేదు. కంగనా రనౌత్‌కు తెలుగు ప్రేక్షకులతో గతంలోనే పరిచయం ఉంది. ప్రభాస్ కథానాయకుడిగా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏక్ నిరంజన్'లో ఆమె కథానాయికగా నటించారు. ఆ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కంగనా.. ఆ తర్వాత మరో తెలుగు చిత్రంలో కనిపించలేదు. ఇప్పుడు రవిబాబు హారర్ సినిమాలో ఆమె నటిస్తున్నారనే ప్రచారం నిజమైతే, దాదాపు 17 ఏళ్ల విరామం తర్వాత టాలీవుడ్‌లోకి ఆమె రీఎంట్రీ ఇచ్చినట్లవుతుంది. బాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు సంపాదించిన కంగనా.. హారర్ కథలో ఎలాంటి పాత్రలో కనిపిస్తారనే అంశం ఆసక్తికరంగా మారుతుంది. కంగనా రనౌత్ తదుపరి చిత్రాల గురించి ఇప్పటికే పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఓ తెలుగు సినిమాలో నటించనున్నారనే ప్రచారం అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ చిత్రానికి సంబంధించి కంగనా ఎంపిక, కథ, పాత్ర, షూటింగ్ వివరాలపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు. ఓవైపు విలక్షణ దర్శకుడు రవిబాబు.. మరోవైపు బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్.. ఈ ఇద్దరి కలయిక నిజమైతే సినిమాపై సహజంగానే భారీ ఆసక్తి ఏర్పడుతుంది. కానీ ప్రస్తుతం ఈ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలకు అధికారిక ధ్రువీకరణ లేదు. కంగనా బృందం లేదా చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడితేనే ఈ ప్రాజెక్టుపై స్పష్టత రానుంది. అప్పటివరకు ఈ క్రేజీ కాంబినేషన్‌ను ఆసక్తికరమైన ప్రచారంగానే చూడాలి.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PUTTI MURALI, PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP : CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR,NIZAMABAD- 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE, PUBLISHED AT HNO.1-86/10/05, KOTARMOOR(PERKIT), ARMOOR-503224, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR : PUTTI MURALI, TELTEL/2022/85170, EMAIL :prajashankaravam@gmail.com